E69 NEWS


# తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో
పని చేయుటకు నియోజకవర్గాలవారీగా
విలేకరులు కావలెను వాట్సాప్ నెం:
9959812941-9949356387

PUBLISHED: JANGAON,HYDERABAD | సంపుటి :01 | సంచిక :239 | శనివారం 08 ఆగస్టు 2026 | ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్ | పేజీలు: 04 | వెల :05/-

## వందేమాతరం ఇక జాతీయ గీతమే




2 లో

- వందేమాతరానికి రాష్ట్రపతి ఆమోదముద్ర
- చట్టరూపం దాల్చిన కీలక బిల్లు
- అవమానిస్తే కఠిన చర్యలు తప్పవు
- ప్రభుత్వ కార్యక్రమాల్లో గౌరవం తప్పనిసరి
- వందేమాతరం ఆలాపనకు కొత్త నిబంధనలు
- దేశవ్యాప్తంగా హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

## సునేత్రా-పీకే భేటీ కలకలం

- కూటమి ధర్మం పాటించాలి
- బీజేపీ నుంచి గట్టి హెచ్చరిక
- మహాయుతిలో చీలిక భయమా?
- పార్టీ బలోపేతంపై పీకే సలహాలు
- భేటీపై రాజకీయ చర్చ
- మహారాష్ట్ర రాజకీయాల్లో కొత్త మలుపు



2 లో

**న్యూస్ డెస్క్, 07 ఆగష్టు (తెలుగు గళం):** బిహార్‌లోని బంకీపూర్ ఉప-ఎన్నికల్లో విజయం సాధించిన ప్రశాంత్ కిషోర్‌తో మహారాష్ట్ర డిప్యూటీ సీఎం , నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు సునేత్రా పవార్ భేటీ రాజకీయ వర్గాల్లో చర్చ రేపుతోంది. ఈ నేపథ్యంలో మహాయుతి కూటమికి ముప్పు తెచ్చే పనులు చేయొద్దని సునేత్రాకు మహారాష్ట్ర బీజేపీ మంత్రి చంద్రశేఖర్ బవాన్కులే హితవు పలికారు. 'కూటమిలో చీలిక తెచ్చే ఏ నిర్ణయాన్ని తీసుకోవద్దు' అని మరాఠా రెవెన్యు మంత్రి సూచించారు. "ఇది వాళ్ల పార్టీ అంతర్గత వ్యవహారం. అయితే, మహాయుతి కూటమిలో ఉంటూ.. భాగస్వామ్య పక్షాలలో అనుమానాలు రేకెత్తించేలా లేదా ఏ పార్టీకైనా నష్టం కలిగించేలా ప్రవర్తించకూడదు.. అందరూ కూటమి ధర్మాన్ని పాటించాల్సిందే" అని ఆయన స్పష్టం చేశారు.


**పీకేతో భేటీకి కారణం ఏంటి?**

ప్రస్తుతం మహారాష్ట్ర మహాయుతి సర్కారులో బీజేపీతో పాటు సునేత్రా పవార్ నాయకత్వంలోని ఎన్సీపీ, ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన కూటమి భాగస్వామ్య పక్షాలుగా ఉన్నాయి. "ఆమె ప్రశాంత్ కిశోర్‌ను ఎందుకు కలిశారనే దానిపై నేను ఎక్కువగా మాట్లాడను..కానీ కూటమిలో అపనమ్మకం లేదా మనస్పర్థలు కలిగించేలా ఎవరూ ప్రవర్తించరాదు" అని మంత్రి చంద్రశేఖర్ వ్యాఖ్యానించారు.

దక్షిణ ముంబయిలోని తన అధికారిక నివాసం 'దేవ్‌గిరి'లో ప్రశాంత్ కిషోర్‌తో సునేత్రా పవార్ భేటీ అయినట్టు ఎన్సీపీ నేత సంజయ్ ఖోడ్కే ధ్రువీకరించారు.

## 'మెటా'కు దెబ్బమీదదెబ్బ

- మెటాపై రూ.7,800 కోట్ల భారీ జరిమానా
- పిల్లల భద్రత నిర్లక్ష్యమే కోర్టు ఆగ్రహం
- టీనేజర్ల మానసిక ఆరోగ్యానికి నష్టం ఆరోపణలు
- బాధిత యువత చికిత్సకు జరిమానా నిధులు
- కోర్టు తీర్పుపై పైకోర్టుకు మెటా అప్పీల్



## ఉగ్రకుట్ర కేసులో ప్రకంపనలు

- జంతర్‌మంతర్ కేసుతో బదిలీ
- అమృత్‌సర్ సీపీకి ట్రాన్స్‌ఫర్
- వ్యాఖ్యలపై రాజకీయ దుమారం
- బీజేపీ అనుమానాలకు బలం?
- ప్రభుత్వం స్పష్టీకరణ విడుదల
- బదిలీపై కొత్త వివాదం



**న్యూస్ డెస్క్, 07 ఆగష్టు (తెలుగు గళం):** జంతర్ మంతర్ నిరసనలపై అమృత్‌సర్ పోలీస్ కమిషనర్ గుర్‌ప్రీత్ సింగ్ భుల్లార్ చేసిన వ్యాఖ్యలు పంజాబ్ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఇప్పుడు భుల్లార్‌ను ఆమ్ ఆద్మీ పార్టీ సర్కార్ బదిలీ చేసింది. దీనిపై బీజేపీ ప్రశ్నల్ని లేవనెత్తింది. కొద్దిరోజుల క్రితం అమృత్‌సర్ పోలీసులు పాకిస్తాన్ ఐఎస్ఐ మద్దతుతో పనిచేస్తున్న ఉగ్రవాద మాడ్యుళ్లపై కీలక ఆపరేషన్ నిర్వహించారు.

2 లో

## ఉగ్ర ప్రచురణలకు మహారాష్ట్ర చెక్

- 114 తీవ్రవాద ప్రచురణలపై మహారాష్ట్ర నిషేధం
- ఉగ్ర భావజాల ప్రచారంపై ప్రభుత్వ కఠిన చర్యలు
- అధికారిక గెజిట్‌తో నిషేధ ఉత్తర్వులు జారీ
- యువతను రెచ్చగొట్టే ప్రచారానికి చెక్
- ముద్రణ, పంపిణీదారులపై చట్టపరమైన చర్యలు
- దేశ భద్రత దృష్ట్యా కీలక నిర్ణయం
- ఉగ్రవాద అనుబంధ ప్రచురణలపై ఉక్కుపాదం

2 లో

## ఎస్సీ, ఎస్టీలకు యథాతథ రిజర్వేషన్లు

- ఎస్సీ, ఎస్టీలకు క్రీమిలేయర్ వర్తించదన్న కేంద్రం
- సుప్రీంకోర్టులో కేంద్రం అఫిడవిట్ దాఖలు
- ఓబీసీ విధానం ఎస్సీ, ఎస్టీలకు కాదని స్పష్టం
- సామాజిక వెనుకబాటుతనం భిన్నమన్న కేంద్రం
- రాజ్యాంగ హక్కుల పరిరక్షణే ప్రభుత్వ లక్ష్యం
- పిటిషన్లను కొట్టివేయాలని కేంద్రం విజ్ఞప్తి
- రిజర్వేషన్లపై కేంద్రం కీలక వైఖరి వెల్లడింపు

2 లో

# దస్తావేజులు నకిలీ దందా అసలైనది!




- ఎన్వోసీ మాఫియా బట్టబయలు!
- ఫైర్ సేఫ్టీ పేరుతో భారీ దగా
- కాలేజీలకు ఫేక్ అనుమతుల వరద
- ఇంటర్ బోర్డులో అవినీతి కలకలం
- ముడుపులతో నడిచిన అఫిలియేషన్లు
- భద్రతను పణంగా పెట్టిన కాలేజీలు
- నకిలీ ఎన్వోసీలపై సర్కార్ సీరియస్
- అధికారులపై విచారణకు రంగం సిద్ధం
- విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం

**న్యూస్ డెస్క్, 07 ఆగష్టు (తెలుగు గళం):** రాష్ట్రంలోని ప్రైవేట్ జూనియర్ కాలేజీల అనుమతులు, ఫైర్ ఎన్వోసీల వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. మొదట చిన్నదిగా కనిపించినా ఈ బోగస్ సర్టిఫికెట్ల వ్యవహారం చినికిచినికి గాలివానలా మారి మొత్తం ఇంటర్ మీడియట్ బోర్డునే చుట్టుముడుతున్నది. విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతూ సాగిన ఈ దందా, అధికారుల లంచాల వాటాల్లో తేడాలు రావడంతోనే రచ్చకెక్కింది. ఐదారేళ్లుగా కనీస నిబంధనలు పాటించని, కమర్షియల్ బిల్డింగ్ లో నడుస్తున్న కాలేజీలకు అధికారులు అనుమతిస్తూ వచ్చారు. అలాంటి కాలేజీలే ఇప్పుడు ముడుపులు ముట్టజెప్పి నకిలీ ఎన్ఓసీలు సమర్పించాయని తెలుస్తున్నది. ఫైర్ ఎన్వోసీల వ్యవహారం క్యూర్ పరిధిలోని డీఐఈఓలు, ఇంటర్ బోర్డులోని ముగ్గురు అధికారులకు తెలిసే కొన్నేళ్లుగా కొనసాగుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మిగతాది 2 లో..

## చాందీపూర వైరస్‌తో దేశంలో కలకలం

- 22 మంది చిన్నారులు బలి
- మరో ఏడుగురి పరిస్థితి విషమం
- సాండ్‌ఫ్లై ద్వారా వైరస్ వ్యాప్తి
- కేంద్ర బృందం రంగంలోకి
- గుజరాత్‌లో హెల్త్ అలర్ట్




2 లో

**న్యూస్ డెస్క్, 07 ఆగష్టు (తెలుగు గళం):** గుజరాత్‌లో 'చాందీపూర' వైరస్ కలకలం రేపుతోంది. ఈ ప్రాణాంతక వైరస్ బారిన పడి ఇప్పటివరకు ఏకంగా 22 మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోవడం తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ విషయాన్ని గుజరాత్ ఆరోగ్య శాఖ మంత్రి ప్రఫుల్ పన్సేరియా అధికారికంగా ధృవీకరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 184 అనుమానిత కేసులు నమోదు కాగా, అందులో 35 మందికి వైరస్ పాజిటివ్‌గా నిర్ధారణ అయింది.

## త్వరలో డిజిటల్ అసెంబ్లీ ప్రారంభం


- పేపర్‌లెస్ పాలనకు శ్రీకారం
- 80 లక్షల ఇళ్లకు టీ-ఫైబర్
- ఏఐతో ప్రభుత్వ సేవల విస్తరణ
- రియల్‌టైమ్ గవర్నెన్స్ డ్యాష్‌బోర్డ్
- డిజిటల్ తెలంగాణ దిశగా అడుగులు



**న్యూస్ డెస్క్, 07 ఆగష్టు (తెలుగు గళం):** రాష్ట్రంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పాలనను మరింత వేగవంతం, పారదర్శకం చేసేందుకు ప్రభుత్వం అనేక విప్లవాత్మక డిజిటల్ కార్యక్రమాలను చేపడుతోందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. శాసనసభ, మండలి వ్యవహారాలను సంపూర్ణంగా డిజిటలైజ్ చేస్తూ త్వరలోనే డిజిటల్ అసెంబ్లీ, డిజిటల్ కౌన్సిల్‌ను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. GOVconnect, ఎలక్ట్రానిక్ సర్వీసెస్ డెలివరీ (మీసేవ) సంయుక్తాధ్వర్యంలో నిర్వహించిన "ఏఐ ట్రాన్స్‌ఫార్మేషన్ కాంక్లేవ్ (తెలంగాణ)"ను ప్రారంభించిన రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి ప్రసంగించారు. డిజిటల్ ఆఫీస్ ప్రాజెక్ట్ ద్వారా ప్రభుత్వ శాఖల్లో పేపర్ లెస్ పాలనకు పెద్దపీట వేస్తున్నామని, నకిలీ పత్రాలకు తావులేకుండా భద్రమైన బ్లాక్‌చెయిన్ ఆధారిత సర్టిఫికెట్ల సేవలను త్వరలో అందుబాటులోకి తేనున్నట్లు ప్రకటించారు.

2 లో

## నాగార్జునసాగర్‌లో వరుణ యాగం



2 లో

- ఆగస్టు 10న నాగార్జునసాగర్‌లో వరుణ యాగం
- రాష్ట్రవ్యాప్తంగా సమృద్ధిగా వర్షాలు కురవాలని ఆకాంక్ష
- యాదగిరిగుట్ట వేద పండితులతో శాస్త్రోక్త నిర్వహణ
- యాగ ఏర్పాట్లను సమీక్షిస్తున్న మంత్రి ఉత్తమ్ కుమార్


## చంద్రుణ్ణి ఢీకొట్టిన స్పేస్ఎక్స్ ఫాల్కన్ రాకెట్



2 లో

- గంటకు 8,700 కిలోమీటర్ల వేగంతో ఢీకొట్టు
- చంద్రుడిపై కొత్త భారీ క్రేటర్ ఏర్పాటైంది
- ఢీకొన్న ప్రాంతాన్ని చిత్రీకరించిన డానురి ఆర్బిటర్
- సోడియం, లిథియం వాయువుల ఆనవాళ్లు గుర్తింపు
- భూమికి ఎలాంటి ప్రమాదం లేదన్న శాస్త్రవేత్తలు
- అంతరిక్ష పరిశోధకులను ఆకట్టుకున్న అరుదైన ఘటన

# వందేమాతరం ఇక జాతీయ గీతమే




**న్యూస్ డెస్క్, 07 ఆగస్టు (తెలుగు గళం):** భారత స్వాతంత్ర్య పోరాటంలో కోట్లాది మందిలో దేశభక్తి రగిలించిన అమర గీతం వందేమాతరం కు అత్యున్నత గౌరవం దక్కింది. వందేమాతరం గీతానికి జాతీయ గీతంతో సమానమైన అధికారిక హోదాను కల్పిస్తూ రూపొందించిన నూతన చట్టానికి భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదముద్ర వేశారు. రాష్ట్రపతి అంగీకారంతో ఈ బిల్లు చట్టరూపం దాల్చింది.

ఇకపై వందేమాతరం గీతాన్ని ఎవరైనా అడ్డుకున్నా, బహిరంగంగా అవమానించినా లేదా హేళన చేసినా దాన్ని చట్టరీత్యా తీవ్రమైన నేరంగా పరిగణించనున్నారు. పాఠశాలలు, ప్రభుత్వ కార్యక్రమాలు, బహిరంగ సభల్లో వందేమాతరం గీతాలాపన జరుగుతున్న సమయంలో గేయానికి విఘాతం కలిగించినా, అసౌకర్యం కలిగించినా చట్టప్రకారం తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. 'జన గణ మన' మాదిరిగానే వందేమాతరం ఆలాపన సమయంలో ప్రదర్శించాల్సిన ప్రాథమిక క్రమశిక్షణ, గౌరవ నియామకాలు ఈ చట్టం ద్వారా అమలులోకి రానున్నాయి. దేశ చారిత్రక ప్రాధాన్యతను, జాతీయ భావాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ చట్టానికి దేశ ప్రథమ పౌరరాలు, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం లభించడం పట్ల దేశప్రజలకు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# 'మెటా'కు దెబ్బమీద దెబ్బ..



**న్యూస్ డెస్క్, 07 ఆగస్టు (తెలుగు గళం):** సోషల్ మీడియా దిగ్గజం మెటా కు వరుసగా ఎదురుదెబ్బలు తగులుతుతున్నాయి. తాజాగా సోషల్ మీడియా వేదికలపై పిల్లలు, టీనేజర్ల మానసిక ఆరోగ్యానికి హాని కలిగించడంతో పాటు వారి భద్రతను నిర్లక్ష్యం చేసినందుకుగానూ మెటాకు 567 మిలియన్ డాలర్లు అంటే భారత కరెన్సీలో సుమారు రూ.4,700 కోట్లకు పైగా భారీ జరిమానా విధిస్తూ న్యూ మెక్సికో కోర్టు చారిత్రాత్మక తీర్పును వెలువరించింది.

రెండు దశల సుదీర్ఘ విచారణ..

న్యూ మెక్సికో అటార్నీ జనరల్ రౌల్ టోరెజ్ దాఖలు చేసిన ఈ కేసు విచారణ రెండు దశల్లో సాగింది. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌లు పిల్లల మానసిక ఆరోగ్యానికి కలిగించే ప్రమాదాలను దాచిపెట్టి, వినియోగదారులను మోసం చేశాయని నిర్ధారిస్తూ మార్చి నెలలోనే జ్యూరీ మెటాపై 375 మిలియన్ డాలర్లు అంటే భారత కరెన్సీలో సుమారు రూ.3,100 కోట్ల జరిమానా విధించింది. తాజాగా న్యాయమూర్తి బ్రయాన్ బీడ్‌షీడ్ ఇచ్చిన ఉత్తర్వులతో అదనంగా మరో 567 మిలియన్ డాలర్లు చెల్లించాలని ఆదేశించడంతో, ఈ ఒక్క కేసులోనే మెటా చెల్లించాల్సిన మొత్తం జరిమానా 942 మిలియన్ డాలర్లకు అంటే మన కరెన్సీలో రూ.7,800 కోట్లు చేరింది. కోర్టు ఆదేశాల ప్రకారం, ఆ జరిమానా సొమ్ములో 420 మిలియన్ డాలర్లు సోషల్ మీడియా అడిక్షన్, మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న యువత చికిత్స నిమిత్తం ఉపయోగించనున్నారు.

పైకోర్టుకు వెళ్తాం.. 'మెటా'

అయితే, మెక్సికో కోర్టు తీర్పుపై 'మెటా' ప్రతినిధులు స్పించారు. తమ ప్లాట్‌ఫారమ్‌లలో టీనేజర్ల భద్రతకే అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, నిబంధనలను నిరంతరం మెరుగుపరుస్తున్నామని తెలిపారు. అయితే, కోర్టు ఇచ్చిన సదురు ఉత్తర్వులపై పైకోర్టులో అప్పీలు చేస్తామని వారు స్పష్టం చేశారు.

# ఎస్సీ, ఎస్టీలకు యథాతథ రిజర్వేషన్లు



**న్యూస్ డెస్క్, 07 ఆగస్టు (తెలుగు గళం):** ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లకు క్రీమిలేయర్ సూత్రాన్ని వర్తింపజేయలేమని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు స్పష్టం చేసింది. ఓబీసీ విభాగంలో అమలవుతున్న ఈ విధానాన్ని ఎస్సీ, ఎస్టీ వర్గాలకు కూడా విస్తరించాలని దాఖలైన పిటిషన్లపై కేంద్రం తాజాగా అఫిడవిట్ దాఖలు చేసింది. ఓబీసీలలో ఆర్థికంగా, సామాజికంగా, విద్యాపరంగా మెరుగైన స్థితిలో ఉన్న వారిని గుర్తించి రిజర్వేషన్ ప్రయోజనాల నుంచి మినహాయించడానికి క్రీమిలేయర్ విధానాన్ని ఉపయోగిస్తున్నారు. అయితే, ఇదే సూత్రాన్ని ఎస్సీ, ఎస్టీలకు వర్తింపజేయాలని కోరుతూ వచ్చిన పిటిషన్లను తోసిపుచ్చాలని కేంద్ర ప్రభుత్వం అత్యున్నత న్యాయస్థానాన్ని ఆమోదయోగ్యమైన వాదనలతో కోరింది.

ఎస్సీ, ఎస్టీ వర్గాలు ఎదుర్కొంటున్న సామాజిక వివక్ష, వెనుకబాటు తనం స్వభావం ఓబీసీలతో పోలిస్తే భిన్నమైనవని, కాబట్టి వారి రిజర్వేషన్లలో క్రీమిలేయర్ పరిమితి విధించడం సరికాదని కేంద్రం తరఫున సమర్పించిన నివేదికలో పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీల రాజ్యాంగ బద్ధమైన హక్కులు, వారి సామాజిక సాధికారతను కాపాడటమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో క్రీమిలేయర్‌ను అమల్లోకి తీసుకురావాలంటూ దాఖలైన పిటిషన్లను కొట్టివేయాలని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు కు విజ్ఞప్తి చేసింది.

# చాందీపూర వైరస్‌తో దేశంలో కలకలం




**న్యూస్ డెస్క్, 07 ఆగస్టు (తెలుగు గళం):** గుజరాత్‌లో 'చాందీపూర' వైరస్ కలకలం రేపుతోంది. ఈ ప్రాణాంతక వైరస్ బారిన పడి ఇప్పటివరకు ఏకంగా 22 మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోవడం తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ విషయాన్ని గుజరాత్ ఆరోగ్య శాఖ మంత్రి ప్రఫుల్ పన్సేరియా అధికారికంగా ధృవీకరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 184 అనుమానిత కేసులు నమోదు కాగా, అందులో 35 మందికి వైరస్ పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. మరణించిన వారందరూ 15 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న పిల్లలే కావడం గమనార్హం. ప్రస్తుతం మరో 7 మంది చిన్నారులు ఆసుపత్రుల్లో తీవ్ర ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నారు. ఈ కేసులు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి నమోదువుతున్నట్లు అధికారులు తెలిపారు.

చాందీపూర అనేది ప్రధానంగా 'సాండ్‌ఫ్లై' (ఇసుక ఈగలు) కుట్టడం ద్వారా వ్యాపించే తీవ్రమైన వైరల్ ఇన్ఫెక్షన్. ఈ వైరస్ బారిన పడిన వారిలో తీవ్రమైన జ్వరం, తలనొప్పి, వాంతులు, మూర్ఛ వంటి లక్షణాలు కనిపిస్తాయి. పరిస్థితి విషమిస్తే ఇది అత్యంత వేగంగా 'ఎన్‌సెఫలైటిస్'కి దారితీస్తుంది. పిల్లల్లో ఈ వ్యాధి మరణాల రేటు ఏకంగా 55% నుండి 77% వరకు చాలా ఎక్కువగా ఉంటుంది. ఇప్పటివరకు ఈ వైరస్‌ను నయం చేయడానికి నిర్దిష్టమైన వ్యాక్సిన్ గానీ, ప్రత్యేకమైన మందులు గానీ అందుబాటులో లేవు.

పరిస్థితి తీవ్రతను దృష్ట్యా గుజరాత్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా హెల్త్ సర్వైలెన్స్ పెంచింది. సాండ్‌ఫ్లైల నివారణకు గ్రామాల్లో, పట్టణాల్లో క్రిమిసంహారక స్ప్రేలు చల్లుతున్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా రంగంలోకి దిగి పరిస్థితిని సమీక్షించడానికి 'నేషనల్ జాయింట్ రెస్పాన్స్ టీమ్'ను గుజరాత్‌కు పంపించింది. పిల్లల్లో జ్వరం లేదా మెదడు వాపు లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రదించి అత్యవసర వైద్య సహాయం అందించాలని అధికారులు తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఉగ్ర ప్రచురణలకు మహారాష్ట్ర చెక్




**న్యూస్ డెస్క్, 07 ఆగస్టు (తెలుగు గళం):** వివిధ నిషేధిత ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు కలిగి, దేశ భద్రతకు విఘాతం కలిగిస్తున్నాయనే ఆరోపణలతో 114 తీవ్రవాద ప్రచురణలు, పత్రికలు, పత్రాలపై మహారాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయి నిషేధం విధించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం అధికారిక గెజిట్ నోటిఫికేషన్‌ను జారీ చేసింది. దేశంలో యువతను తీవ్రవాదం వైపు ఆకర్షించడం, మత విద్వేషాలను రెచ్చగొట్టడం, ఉగ్రవాద భావజాలాన్ని ప్రచారం చేయడమే లక్ష్యంగా ఈ పత్రికలు పనిచేస్తున్నట్లు విచారణలో తేలడంతో ప్రభుత్వం ఈ కఠిన నిర్ణయం తీసుకుంది.

నిషేధానికి గురైన ప్రచురణల జాబితాలో 'వాయిస్ ఆఫ్ ఖురాసన్ మ్యాగజైన్', 'ది రివాల్యూషనరీ రిసర్జెన్స్', 'కాశ్మీర్ కిఫా – రెసిలియన్స్ ౘ కరేజ్', 'ది సోల్ ఆఫ్ రెసిస్టెన్స్', అలాగే 'నవాయ్ గజ్వా–ఎ–హింద్' వంటి కీలక పత్రికలు ఉన్నాయని గెజిట్ నోటిఫికేషన్ ద్వారా స్పష్టమవుతోంది. ఇవన్నీ విదేశీ అలాగే దేశీయ ఉగ్రవాద సంస్థలతో ప్రత్యక్ష, పరోక్ష సంబంధాలు కలిగి ఉన్నాయని ప్రభుత్వం గుర్తించింది. ఈ పత్రికల ముద్రణ, పంపిణీ, డిజిటల్ ప్రచారంలో పాల్గొనే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని అధికారులు స్పష్టం చేశారు.

# నాగార్జునసాగర్‌లో వరుణ యాగం

**న్యూస్ డెస్క్, 07 ఆగస్టు (తెలుగు గళం):** రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిసి, ప్రాజెక్టులు అన్నీ జలకళను సంతరించుకోవాలని ఆకాంక్షిస్తూ తెలంగాణ ప్రభుత్వం భారీ ఎత్తున వరుణ యాగం నిర్వహించాలని నిర్ణయించింది. సీఎం రేవంత్ రెడ్డి ఆలోచన, ఆదేశాల మేరకు ఈ విశిష్ట ఆధ్యాత్మిక క్రతువుకు శ్రీకారం చుట్టారు. యాగ ముహూర్తం, ప్రాంగణం యాదగిరిగుట్ట దేవస్థానం ప్రధాన అర్చకులు, వేద పండితులు, సిద్ధాంతి వరుణ యాగానికి ఆగస్ట్ 10న శుభ ముహూర్తంగా ఖరారు చేశారు. నల్గొండ జిల్లాలోని ప్రసిద్ధ నాగార్జునసాగర్ డ్యామ్ తీరంలో ఉన్న 'విజయవిహార్' ప్రాంగణం యాగ నిర్వహణకు వేదిక కానుంది.

రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో, యాదగిరిగుట్ట క్షేత్ర వేద పండితులు శాస్త్రోక్తంగా, వైదికాచారాల ప్రకారం వరుణ యాగాన్ని జరగనుంది. కృష్ణా, గోదావరి నదుల్లోకి భారీగా వరద వెల్లువెత్తాలని, చెరువులు, కుంటలు నిండి పాడిపంటలు సమృద్ధిగా పండాలని, రాష్ట్ర ప్రజలందరూ సస్యశ్యామలంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక పూజలు చేపట్టనున్నారు. వరుణ యాగానికి సంబంధించి ఏర్పాట్లను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్షిస్తున్నారు.

# చంద్రుణ్ణి ఢీకొట్టిన స్పేస్‌ఎక్స్ ఫాల్కన్ రాకెట్



**న్యూస్ డెస్క్, 07 ఆగస్టు (తెలుగు గళం):** అంతరిక్షంలో ఒక ఆసక్తికరమైన ఉదంతం చోటుచేసుకుంది. ఆగస్టు 5న స్పేస్‌ఎక్స్ సంస్థకు చెందిన 'ఫాల్కన్–9' రాకెట్ చంద్రుడి ఉపరితలాన్ని అత్యంత వేగంతో ఢీకొట్టింది. అంతరిక్ష పరిశోధనా సంస్థల వివరాల ప్రకారం.. ఈ రాకెట్ భాగాన్ని 2025 జనవరి 15న ప్రయోగించారు. ఆ సమయంలో ఇది 'ఫైర్‌ఫ్లై ఏరోస్పేస్ బ్లూ ఘోస్ట్' వంటి చంద్ర ల్యాండర్లను సురక్షితంగా అంతరిక్షంలోకి తీసుకెళ్లింది. మిషన్ పూర్తయిన తర్వాత ఈ రాకెట్ అప్పర్ స్టేజ్ అంతరిక్షంలోనే వ్యర్థంగా మిగిలిపోగా, సూర్యకాంతి, వివిధ గ్రహాల గురుత్వాకర్షణ శక్తుల ప్రభావం వల్ల దీని కక్ష్య మారి క్రమంగా చంద్రుడి వైపు పయనించింది.

సుమారు 4 టన్నుల బరువున్న ఈ వ్యోమ నౌక భాగం గంటకు ఏకంగా 8,700 కిలోమీటర్ల ప్రచండ వేగంతో చంద్రుడి పశ్చిమ అంచున ఉన్న 'ఐన్‌స్టీన్ క్రేటర్' సమీప ప్రాంతాన్ని ఢీకొట్టింది. ఈ ధాటికి చంద్రుడిపై కొత్తగా ఒక భారీ క్రేటర్ ఏర్పడింది. నాసా ప్రాథమిక అంచనాల ప్రకారం ఈ క్రేటర్ సుమారు 60 అడుగుల వెడల్పు, 12 అడుగుల లోతుతో ఉంది. ఈ ఘటనలో చంద్రుడి ఉపరితలంపై ఉన్న ధూళి, రాళ్లు పెద్ద ఎత్తున గాల్లోకి ఎగిరిపడ్డాయి.

ఈ విలక్షణ అంతరిక్ష ఘట్టాన్ని పరిశోధకులు ఆసక్తిగా గమనించారు. యూరోపియన్ సదరన్ అబ్జర్వేటరీ టెలిస్కోప్ ద్వారా శాస్త్రవేత్తలు ఢీకొన్న ప్రాంతంలో సోడియం, లిథియం వాయువుల సంకేతాలను గుర్తించగా, దక్షిణ కొరియాకు చెందిన 'డానురి లూనర్ ఆర్బిటర్' ఈ కొత్త క్రేటర్ యొక్క ఫోటోలను స్పష్టంగా చిత్రీకరించింది. ఈ ఘటన వల్ల భూమికి ఎలాంటి ప్రమాదం కలగలేదని, గతంలో కూడా ఇలాంటి అనుకోని రాకెట్ భాగాలు చంద్రుడిని ఢీకొట్టిన సంఘటనలు నమోదయ్యాయని శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు.

# త్వరలో డిజిటల్ అసెంబ్లీ ప్రారంభం

మొదటి పేజీ తరువాయి

గ్రామీణ ప్రాంతాల సాధికారత లక్ష్యంగా టీ–ఫైబర్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 80 లక్షలకు పైగా గ్రామీణ కుటుంబాలకు హైస్పీడ్ డిజిటల్ కనెక్టివిటీని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. వృద్ధులు, దివ్యాంగులకు ఎలాంటి శ్రమ లేకుండా ప్రభుత్వ పౌర సేవలను నేరుగా వారి ఇంటి ముంగిటకే చేరవేసే వ్యవస్థను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. పాలనా వ్యవస్థలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), క్లౌడ్ కంప్యూటింగ్, డేటా అనలిటిక్స్ వంటి ఆధునిక సాంకేతికతలను విస్తృతంగా వినియోగిస్తున్నట్లు పేర్కొన్నారు. దాదాపు 20కి పైగా ప్రధాన ప్రభుత్వ శాఖలను ఒకే వేదికపైకి తెచ్చి, పథకాల అమలును నిరంతరం పర్యవేక్షించేందుకు రియల్ టైమ్ గవర్నమెంట్ డ్యాష్ బోర్డును రూపొందిస్తున్నట్లు మంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో మహారాష్ట్ర సీఎంవో చీఫ్ ఎకనమిక్ అడ్వైజర్ ప్రవీణ్ పరదేశి, సెంటర్ ఫర్ రైల్వే ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ ఎండీ జీవీఎల్ సత్య కుమార్, నేషనల్ ఇంటర్నెట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా సీఈవో డాక్టర్ దేవేష్ త్యాగి, డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ అడిషనల్ సెక్రటరీ సౌరభ్ కె.తివారీలతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సునేత్రా-పీకే భేటీ కలకలం

మొదటి పేజీ తరువాయి

అయితే, ఈ సమావేశంలో ఏం చర్చించారనే వివరాలను మాత్రం ఎన్సీపీ నేత వెల్లడించారు. ఈ ఏడాది జనవరిలో బారామతిలో జరిగిన విమాన ప్రమాదంలో అజిత్ పవార్ మరణించిన తర్వాత ఆయన సతీమణి సునేత్రా పవార్‌తో పీకే భేటీ కావడం ఇది రెండోసారి. కొద్ది నెలల కిందట వీరిద్దరి మధ్య మొదటి భేటీ జరిగినప్పుడు, ప్రశాంత్ కిశోర్ తమ కుటుంబానికి పరిచయస్థుడేనని ఆమె కుమారుడు, ఎన్సీపీ నేత పార్థ్ పవార్ వెల్లడించిన విషయం తెలిసిందే.

బీజేపీ కోటలో ప్రశాంత్ కిషోర్ పాగా.. కాషాయ పార్టీకి షాక్

పార్టీ బలోపేతం సలహాలు

అయితే, పార్టీ సంస్థాగత పునర్నిర్మాణంపై కిషోర్ సలహాలు ఇచ్చినట్టు ఎన్సీపీ అధికార ప్రతినిధి సూరజ్ చవాన్ తెలిపారు. ఈ భేటీకి అధ్యక్షురాలు సునేత్రా పవార్, ఆమె కుమారుడు పార్థ్ పవార్, సీనియర్ నాయకులు హాజరయ్యారని పేర్కొన్నారు. "పార్టీని ఎలా బలోపేతం చేయాలి, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు క్షేత్రస్థాయికి చేరేలా ఎలా చూడాలి అనే విషయాలపై చర్చించడానికి ఇది ఒక అంతర్గత సమావేశం" అని ఆయన అన్నారు. ఎన్సీపీ రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ తట్కరే పనితీరుపై కిషోర్ అసంతృప్తి వ్యక్తం చేశారని, ఆయనను తొలగించాలని కోరారన్న ఊహాగానాలను చవాన్ తోసిపుచ్చారు. ఇదే విషయాన్ని ఎన్సీపీ మంత్రి నరహరి జివారీ సైతం ఖండించారు.

మహారాష్ట్ర బీజేపీ నేతలు కూటమిలో చీలిక రాకుండా హెచ్చరించడం గురించి మీ అభిప్రాయమేమిటి? ఈ వ్యాఖ్యలు రాజకీయాలపై ఎలాంటి ప్రభావం చూపుతాయని మీరు అనుకుంటున్నారు? మీ అభిప్రాయాలను కామెంట్ బాక్స్‌లో తెలియజేయండి.

# దస్తావేజులు నకిలీ... దందా అసలైనది!

మొదటి పేజీ తరువాయి

సదరు డీఐఈఓలు క్షేత్రస్థాయికి వెళ్లి తనిఖీ చేయకుండా నకిలీ ఎన్వోసీలు సృష్టించిన వ్యవహారంలో అంతా తామే చూసుకుంటామని ప్రైవేట్ జూనియర్ కాలేజీలకు భరోసా ఇస్తున్నారు. కొన్నేళ్లుగా బదిలీ చేయకుండా ఇంటర్ బోర్డు కార్యాలయంలో తిష్టవేసిన అధికారులు ఈ తతంగంలో చురుగ్గా వ్యవహరిస్తున్నారని తెలుస్తున్నది. ఇంటర్ బోర్డు కార్యాలయంలో ఒక జేఎస్ స్థాయి ఆఫీసర్, సదరు అధికారికి ఇద్దరు సూపరిండెంట్ స్థాయి అధికారులు సహకరిస్తూ అఫ్లియేషన్ల విషయంలో భారీఎత్తున ప్రైవేట్ కాలేజీల నుంచి ముడుపులు అందుకుంటున్నట్టు సీఎంవో స్థాయి అధికారుల్లో సైతం జోరుగా చర్చ నడుస్తున్నది.

జీహెచ్‌ఎంసీ పేరుతో నకిలీ ఎన్‌వోసీలు

రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్ల క్రితం హైడ్రాను ఏర్పాటు చేసింది. అప్పటివరకు జీహెచ్‌ఎంసీ పరిధిలో ఉన్న అగ్నిమాపక విభాగాన్ని అందులో విలీనం చేశారు. అంతకుముందు జీహెచ్‌ఎంసీ పరిధిలోని అగ్నిమాపక విభాగం కాలేజీలకు ఫైర్ ఎన్వోసీలు జారీ చేయగా, విలీనం తర్వాత హైడ్రా పరిధిలోకి వెళ్లింది. కానీ కాలేజీలు రెండేళ్లుగా జీహెచ్‌ఎంసీ పేరుతో ఫైర్ ఎన్వోసీలు సమర్పించడం, అధికారులు ఎక్కడా అభ్యంతరం వ్యక్తం చెప్పకపోవడం గమనార్హం. హైదరాబాద్ మెహిదీపట్నంలోని హిదాయత్ జూనియర్ కాలేజీకి జీహెచ్‌ఎంసీ పేరిట 2025లో ఎన్వోసీ ఇవ్వడం గమనార్హం. ఆ కాలేజీ భవనం ఎత్తు 14.95 మీటర్లు ఉంది. కాలేజీ భవనం ఎత్తు 15 మీటర్ల లోపు ఉంటే హైడ్రా, ఆపై దాటితే అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ ఎన్వోసీ జారీచేయాల్సి ఉంటుంది. కానీ ఆ కాలేజీ ఫైర్ ఎన్వోసీలో జీహెచ్‌ఎంసీ కమిషనర్ పర్మిషన్ ఇచ్చినట్టు ఉంది. ఈ తతంగాన్ని పరిశీలిస్తే ఫేక్ ఎన్వోసీల విషయంలో ఇంటర్ బోర్డు అధికారులు ఎంత దందా నడిపిస్తున్నారో స్పష్టమవుతున్నది.

నకిలీ ఫైర్ ఎన్‌వోసీలు సమర్పించిన కాలేజీలు

1. బాబుల్ రెడ్డి జూనియర్ కాలేజీ, ఎర్రగడ్డ మెయిన్ రోడ్, 2.న్యూ శ్రీచైతన్య జూనియర్ కాలేజీ, టోలిచౌకి, 3.ఎస్‌ఎం అలీస్ శాంతినికేతన్ జూనియర్ కాలేజీ, మెహదీపట్నం, 4.శ్రీ అక్షర జూనియర్ కాలేజీ, అమీర్‌పేట, 5.అచీవర్స్ జూనియర్ కాలేజీ, టోలిచౌకి, 6.హిదాయా జూనియర్ కాలేజీ, ఆసిఫ్ నగర్, 7.జునైద్ జూనియర్ కాలేజీ, హుమాయూన్ నగర్, 8.సెయింట్ పాట్రిక్స్ ఆల్టిట్యూడ్ జూనియర్ కాలేజీ, నల్లకుంట, 9.ఫిట్జీ జూనియర్ కాలేజీ, నారాయణగూడ, 10.శ్రీవాణి జూనియర్ కాలేజీ ఫర్ గర్ల్స్, మలక్‌పేట, 11.ఎస్ వీ జూనియర్ కాలేజీ ఆఫ్ కామర్స్, చంపాపేట, 12.శ్రీ శ్రీనివాస జూనియర్ కాలేజీ, సంతోష్ నగర్, 13.విజనరీ జూనియర్ కాలేజీ, గౌజీపురా, 14.ముషీరాబాద్ జూనియర్ కాలేజీ గర్ల్స్, జమిస్తాన్‌పూర్, 15.సరోజినీనాయుడు జూనియర్ కాలేజీ ఫర్ గర్ల్స్, చిక్కడపల్లి, 16.విజనరీ జూనియర్ కాలేజీ, షాఅలీబండా, 17.లైఫ్ లైన్ ఒకేషనల్ జూనియర్ కాలేజీ, చార్మినార్, 18.నానో జూనియర్ కాలేజీ, నల్లకుంట, 19.ఆద్య జూనియర్ కాలేజీ, దిల్ సుఖ్ నగర్, 20.హిదాయా జూనియర్ కాలేజీ, కొత్త సంతోష్ నగర్ కాలనీ, 21.ఐఏసీజీ ఒకేషనల్ జూనియర్ కాలేజీ, మూసారాంబాగ్, 22.శ్రీసాయి చైతన్య జూనియర్ కాలేజీ, సికింద్రాబాద్, 23.సింధు జూనియర్ కాలేజీ ఫర్ గర్ల్స్, రేతిబౌలి, 24.మాస్టర్స్ జూనియర్ కాలేజీ, యూసుఫ్ గూడ చెక్ పోస్ట్, 25.శ్రీ వెంకట పద్మావతి జూనియర్ కాలేజీ, బోరబండ, 26.సెయింట్ ఫ్రాన్సిస్ జూనియర్ కాలేజీ, బేగంబజార్, 27.విదిశ జూనియర్ కాలేజీ, తిరుమలగిరి, 28.శ్రీ మేధా జూనియర్ కాలేజీ, అత్తాపూర్, 29.ఎక్సలెన్సియా జూనియర్ కాలేజీ, మదీనాగూడ, 30.విశ్వభారతి జూనియర్ కాలేజీ, హైదర్‌షాకోట్, 31.వికాస్ జూనియర్ కాలేజీ, వనస్థలిపురం, 32.శ్రీ తపస్య జూనియర్ కాలేజీ, బండ్లగూడ జాగీర్, 33. జ్ఞానదీపిక జూనియర్ కాలేజీ, మాదాపూర్, 34. భార్గవ జూనియర్ కాలేజీ, బైరామల్ గూడ, 35.విజ్ఞాన భారతి జూనియర్ కాలేజీ, యాప్రాల్, 36.శ్రీ అభ్యాస జూనియర్ కాలేజీ, అల్వాల్, 37.సీఎంఎస్ కామర్స్ జూనియర్ కాలేజీ, ఈసీఐఎల్, 38.ఎక్సలెన్సియా జూనియర్ కాలేజీ, పేట్ బషీరాబాద్, 39.శ్రీ నారాయణ కాలేజీ ఆఫ్ కామర్స్, ఉప్పల్, 40.ఎక్సలెన్సియా జూనియర్ కాలేజీ, దమ్మాయిగూడ, 41.శ్రీ చైతన్యభారతి జూనియర్ కాలేజీ, చందానగర్, 42.ఇక్బాలియా జూనియర్ కాలేజీ, అత్తాపూర్, 43.కైట్స్ జూనియర్ కాలేజీ, ఓల్డ్ బోయిన్‌పల్లి, 44. కెరీర్ పాయింట్ జూనియర్ కాలేజీ, పేట్ బషీరాబాద్ నకిలీ ఫైర్ ఎన్వోసీలు సమర్పించాయి.

బోర్డు కార్యదర్శి ఏమన్నారంటే..?

ఈ వ్యవహారంపై ఇంటర్ బోర్డు కార్యదర్శి అభిలాష అభినవ్ స్పందిస్తూ.. నకిలీ ఫైర్ ఎన్వోసీల వ్యవహారంపై సమగ్ర విచారణ జరుపుతామని వెల్లడించారు. ఇతర ప్రభుత్వ శాఖల బోర్డు పూర్తి సమన్వయంతో పనిచేస్తోందన్నారు. నిబంధనలను ఉల్లంఘించినట్లు తేలిన కాలేజీలపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. వివిధ కాలేజీలు సమర్పించిన ఫైర్ ఎన్‌ఓసీల ప్రామాణికత, నిజానిజాలను క్షుణ్ణంగా తేల్చేందుకు ఇప్పటికే అంతర్గత విచారణను ప్రారంభించినట్టు పేర్కొన్నారు.

# ఉగ్రకుట్ర కేసులో ప్రకంపనలు



**న్యూస్ డెస్క్, 07 ఆగస్టు (తెలుగు గళం):** జంతర్ మంతర్ నిరసనలపై అమృత్‌సర్ పోలీస్ కమిషనర్ గుర్‌ప్రీత్ సింగ్ భుల్లార్ చేసిన వ్యాఖ్యలు పంజాబ్ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఇప్పుడు భుల్లార్‌ను ఆమ్ ఆద్మీ పార్టీ సర్కార్ బదిలీ చేసింది. దీనిపై బీజేపీ ప్రశ్నల్ని లేవనెత్తింది. కొద్దిరోజుల క్రితం అమృత్‌సర్ పోలీసులు పాకిస్తాన్ ఐఎస్ఐ మద్దతుతో పనిచేస్తున్న ఉగ్రవాద మాడ్యూళ్లపై కీలక ఆపరేషన్ నిర్వహించారు. ఈ కేసులో నలుగురు మైనర్లతో పాటు మొత్తం తొమ్మిది మందిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి మూడు పిస్టళ్లు, తొమ్మిది లైవ్ కార్ట్రిడ్జ్‌లు, నాలుగు పెట్రోల్ బాంబులను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు భద్రతా కేంద్రాలపై నిఘా నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఈ నేపథ్యంలో కమిషనర్ గుర్‌ప్రీత్ సింగ్ భుల్లార్ మాట్లాడుతూ.. అరెస్టైన నిందితులు ఢిల్లీలోని జంతర్ మంతర్‌కు వెళ్లి అక్కడ రెక్కీ నిర్వహించారని, నీట్ పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న నిరసనల్లో నిరసనకారులపై పెట్రోల్ బాంబులతో దాడి చేసే కుట్ర పన్నినట్లు విచారణలో వెల్లడైనట్లు తెలిపారు. ఈ వ్యాఖ్యలు రాజకీయంగా కూడా సంచలనంగా మారాయి.

ఇప్పుడు, ఈ వ్యాఖ్యలపై పంజాబ్ ప్రభుత్వం స్పందించింది. ఆయన వ్యాఖ్యల్ని తప్పుగా అర్థమయ్యేలా ఎంపిక చేసిన భాగాలను మాత్రమే ప్రచారం చేశారని ప్రభుత్వం స్పష్టం చేసింది. అరెస్టైన వ్యక్తులు జంతర్ మంతర్ నిరసనల్లో పాల్గొన్నారని లేదా నిరసనకారులకు ఉగ్రవాద మాడ్యూళ్లతో సంబంధం ఉందని కమిషనర్ ఎక్కడా చెప్పలేదని స్పష్టతనిచ్చింది.

ఈ వివాదం తర్వాత భుల్లార్‌ను బదిలీ చేయడంపై రాజకీయ చర్చ మొదలైంది. ఈ బదిలీకి జంతర్ మంతర్ వ్యాఖ్యలే కారణమని బీజేపీ ఆరోపిస్తోంది. మాజీ కేంద్ర మంత్రి, బీజేపీ నేత రవ్‌నీత్ సింగ్ బిట్టూ ఈ బదిలీపై అనుమానం వ్యక్తం చేశారు. ఆయనను బదిలీ చేసిన సమయంపై అనేక సందేహాలు ఉన్నాయని అన్నారు. జంతర్ మంతర్ కుట్రపై ఆయన చేసిన వ్యాఖ్యలు అరవింద్ కేజ్రీవాల్‌కు అసౌకర్యంగా మారాయా? అని ప్రశ్నించారు.

## బోనాల పండుగ వేళ గుడ్‌న్యూస్: వరుసగా మూడ్రోజులు సెలవులు



**న్యూస్ డెస్క్, 07 ఆగస్టు (తెలుగు గళం):** తెలంగాణలోని పాఠశాలలు, కళాశాలలకు ఈ వారాంతంలో (వీకెండ్) వరుసగా మూడు రోజుల పాటు వరుస సెలవులు రానున్నాయి. ఈ నెల (ఆగస్టు)లో పండుగలు, సాధారణ సెలవుల కారణంగా విద్యాసంస్థలు సుదీర్ఘ హాలీడేస్ రాబోతున్నాయి. ఆగస్టు 08న రెండో శనివారం సెలవు, ఆగస్టు 09న ఆదివారం, ఆగస్టు 10న సోమవారం బోనాల పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యాసంస్థలకు అధికారిక సెలవు ప్రకటించింది. శని, ఆది, సోమవారాలు ఒకేసారి కలిసి రావడంతో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు "లాంగ్ వీకెండ్" లభించనుంది. ఈ ఆగస్ట్ నెలలో ఆదివారాలు, రెండో శనివారం, స్వాతంత్ర్య దినోత్సవం, బోనాలు తదితర పండుగలు, వరుస వేడుకల కారణాల వల్ల విద్యాసంస్థలకు మొత్తం 11 రోజుల పాటు సెలవులు లభించనున్నాయి. వరుస సెలవుల నేపథ్యంలో పలు కుటుంబాలు బోనాల ఉత్సవాల్లో పాల్గొనడానికి, స్వగ్రామాలకు ప్రయాణమయ్యేందుకు సిద్ధమవుతున్నాయి.

## స్టేషన్ ఘన్‌పూర్ లో ఎరువుల దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు

### నిబంధనలు ఉల్లంఘించిన డీలర్లకు షోకాజ్ నోటీసులు

**స్టేషన్ ఘన్‌పూర్, ఆగస్టు 7 (తెలుగు గళం న్యూస్)**

జిల్లా కలెక్టర్ ఆదేశాలు, వ్యవసాయ శాఖ సూచనల మేరకు ఘన్‌పూర్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకురాలు ఎం. అపర్ణ ఆధ్వర్యంలో, వ్యవసాయ విస్తరణ అధికారులు (ఎఇఓలు) మరియు మండల వ్యవసాయ అధికారి (ఎంఎఓ)తో కలిసి స్టేషన్ ఘన్‌పూర్ మండలంలోని ఇప్పగూడెం, శివునిపల్లి, మీడికొండ, స్టేషన్ ఘన్‌పూర్ గ్రామాల్లోని ఎరువుల దుకాణాలపై శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.తనిఖీల సందర్భంగా ఎరువుల నిల్వలు, విక్రయ రిజిస్టర్లు, పాయింట్ ఆఫ్ సేల్ లావాదేవీలు, కొనుగోలు బిల్లులు, ధరల పట్టికల ప్రదర్శన, లైసెన్స్ నిబంధనల అమలు వంటి అంశాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు.ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం మాత్రమే ఎరువులను విక్రయించాలని, రైతులకు సకాలంలో అందుబాటులో ఉంచాలని డీలర్లకు సూచించారు.తనిఖీల్లో కొంతమంది ఎరువుల డీలర్ల వద్ద నిబంధనలకు విరుద్ధమైన అంశాలు గుర్తించడంతో వారికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఉల్లంఘనలు పునరావృతమైతే ఎరువుల (నియంత్రణ) ఉత్తర్వులు--1985 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.ఈ సందర్భంగా అధికారులు రైతులకు సూచనలు చేస్తూ, ఎరువులను తప్పనిసరిగా అధీకృత విక్రయ కేంద్రాల నుంచే కొనుగోలు చేయాలని,




ప్రతి కొనుగోలుకు బిల్లు తీసుకోవాలని, ఎక్కడైనా అధిక ధరలకు విక్రయాలు లేదా ఇతర అక్రమాలు జరిగినట్లు గమనిస్తే వెంటనే సమీప వ్యవసాయ అధికారులకు సమాచారం అందించాలని కోరారు.

## విద్యుత్ షాక్‌తో మహిళ మృతి

**పర్వతగిరి, ఆగస్టు 7 (తెలుగు గళం న్యూస్)**



పర్వతగిరి మండలం తురకల సోమవారం గ్రామంలో శుక్రవారం విషాద ఘటన చోటుచేసుకుంది.గ్రామానికి చెందిన షేక్ సలీమా (35) విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందారు.సమాచారం మేరకు, శుక్రవారం మధ్యాహ్నం సుమారు 12 గంటల సమయంలో ఇంట్లో ఉన్న విద్యుత్ హీటర్‌ను తొలగిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు ఆమెకు విద్యుత్ షాక్ తగిలింది.ఇది గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు వెంటనే ఆమెను వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.సలీమా మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉండగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం.

## విద్యార్థుల్లో స్వాతంత్ర్య స్ఫూర్తి నింపిన వినూత్న కార్యక్రమం

**(తెలుగు గళం న్యూస్) ధర్మసాగర్ ఆగస్టు 07**







స్వాతంత్ర్య దినోత్సవాన్ని కేవలం చారిత్రక సంఘటనలకే పరిమితం చేయకుండా, "నా జీవితంలో స్వాతంత్ర్యం అంటే ఏమిటి?" అనే అంశంపై విద్యార్థుల్లో ఆలోచన రేకెత్తించే వినూత్న కార్యక్రమాన్ని ధర్మసాగర్ జెడ్పీహెచ్‌ఎస్ బాలుర పాఠశాలలో జన విజ్ఞాన వేదిక సహకారంతో నిర్వహించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.బి. ధర్మ ప్రకాశ్ నాయకత్వంలో, సోషల్ టీచర్ ఎం. రామకృష్ణ సమన్వయంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ప్రసంగాలు, కవితలు, కథనాలు, దేశభక్తి గీతాలు, వ్యక్తిగత అనుభవాలు, శాస్త్రీయ ఆవిష్కరణలపై తమ ఆలోచనలను సృజనాత్మకంగా వ్యక్తీకరించారు.ఈ సందర్భంగా "నాకు స్వాతంత్ర్యం అంటే ఏమిటి?", "నా పాఠశాల--నా గర్వం", "నేను ప్రధానమంత్రినైతే", "పౌరుడిగా నా బాధ్యతలు", "సమానత్వం--సమాన అవకాశాలు", "శాస్త్రీయ దృక్పథం- -ప్రజాస్వామ్యం", "రాజ్యాంగం--నా బాధ్యతలు", "సోషల్ మీడియా--స్వేచ్ఛ", "మహిళలు--స్వేచ్ఛ", "వాతావరణ మార్పు--నా భవిష్యత్తు" వంటి అంశాలపై విద్యార్థులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు.ప్రారంభోపన్యాసంలో హెచ్‌ఎం ధర్మ ప్రకాశ్ మాట్లాడుతూ, ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో సంభాషణా నైపుణ్యాలు, సృజనాత్మకత, విమర్శనాత్మక ఆలోచన, రాజ్యాంగ విలువలపై అవగాహన, ఆత్మవిశ్వాసం పెంపొందించడమే లక్ష్యమని తెలిపారు. స్వేచ్ఛను బాధ్యతతో వినియోగించే పౌరులుగా ఎదగడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు సురేష్, పద్మజ, కిరణ్మయి విద్యార్థులకు మార్గదర్శకత్వం వహించారు.కార్యక్రమం ముగింపులో విద్యార్థులు "నా స్వేచ్ఛను బాధ్యతాయుతంగా వినియోగిస్తాను. ప్రతి వ్యక్తిని గౌరవిస్తాను.రాజ్యాంగాన్ని గౌరవిస్తాను. శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందిస్తాను. ప్రకృతిని కాపాడుతాను. న్యాయమైన, సమానమైన, ప్రజాస్వామ్య భారతదేశ నిర్మాణానికి కృషి చేస్తాను" అంటూ ప్రతిజ్ఞ చేశారు.

## క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఆగస్టు 10 జైల్ భరో విజయవంతం చేయాలి

### ఇప్పగూడెం గ్రామ పంచాయతీకి ప్రజాసంఘాల మెమోరాండం

**తెలుగు గళం న్యూస్ స్టేషన్ ఘనపూర్, ఆగస్టు 7**



క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఆగస్టు 10న నిర్వహించనున్న "జైల్ భరో" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ సీఐటీయూ, ఏఐకేఎస్, ఏఐఏడబ్ల్యూయూ ప్రజాసంఘాల నాయకులు శుక్రవారం స్టేషన్ ఘనపూర్ మండలం ఇప్పగూడెం గ్రామ పంచాయతీలో మెమోరాండం సమర్పించారు.గ్రామ పంచాయతీ కార్యదర్శి యుగేందర్, సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులకు వినతిపత్రం అందజేసిన నాయకులు, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే గ్రామ పంచాయతీలు ప్రత్యేక తీర్మానాలు చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని కోరారు.ఈ సందర్భంగా మత్స్యకార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మునిగెల రమేష్ మాట్లాడుతూ, కార్మిక కోడ్‌లను రద్దు చేయాలని, రైతులు, వ్యవసాయ కార్మికుల హక్కులను పరిరక్షించాలని, ప్రజా వ్యతిరేక విధానాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.కార్మిక--కర్షక--ప్రజా హక్కుల పరిరక్షణ కోసం నిర్వహిస్తున్న ఆగస్టు 10 "జైల్ భరో" కార్యక్రమంలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ లింగనబోయిన రాజు, వార్డు సభ్యులు మంద మహేందర్, లింగనబోయిన శ్రీకాంత్, పోలాసు పద్మాకర్‌తో పాటు ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆగస్టు 10న జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

- జఫర్‌గడ్ మండలంలోని ఆరు గ్రామాల్లో గ్రామపంచాయతీ కార్యదర్శులకు వినతిపత్రాలు

**తెలుగు గళం న్యూస్ జఫర్‌గడ్, ఆగస్టు 7**




కేంద్ర కార్మిక సంఘాలు, ట్రేడ్ యూనియన్లు, సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ కమిటీల పిలుపు మేరకు జఫర్‌గడ్ మండలంలోని తమ్మడపల్లి జి.షా, పెల్లి, సూరారం, హిమ్మత్‌నగర్, తిమ్మాపూర్, ఓబులాపురం గ్రామాల్లో శుక్రవారం గ్రామపంచాయతీ కార్యదర్శులకు వినతిపత్రాలు సమర్పించారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక, కార్మిక, రైతు, వ్యవసాయ కూలీల వ్యతిరేక విధానాలను వెంటనే ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ గుండెబోయిన రాజు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న కార్మిక చట్టాల మార్పులు, రైతు వ్యతిరేక విధానాలు, వ్యవసాయ కూలీల హక్కులను దెబ్బతీసే నిర్ణయాలను వెంటనే రద్దు చేయాలని కోరారు.ఈ అంశాలపై ప్రతి గ్రామసభలో తీర్మానం చేసి, కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీల ప్రయోజనాలను కాపాడేలా కేంద్ర ప్రభుత్వానికి తీర్మానాలను పంపించాలని గ్రామపంచాయతీలను కోరారు.ఆగస్టు 10న జనగామ జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వేల్పుల రవి, ముక్కెర రాజు, వడ్లకొండ రాజు, జల్లెల శ్రీను, నీరటి కొమురయ్య, చిలువేరు మల్లేష్, ఎండీ శంషుద్దీన్, పులిగిల్ల నాగరాజు, అన్నపు ప్రభాకర్, ఎండీ వసీం, వేల్పుల రమేష్, దొంతూరి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## కామ్రేడ్ జమాలుద్దీన్ ఆశయాలను ముందుకు తీసుకెళ్తాం-సీపీఎం నాయకులు

### తమ్మడపల్లి జి గ్రామంలో జమాలుద్దీన్ 24వ వర్ధంతి కార్యక్రమం

**తెలుగు గళం న్యూస్ జఫర్‌గడ్, ఆగస్టు 7**





సీపీఎం పార్టీ సీనియర్ నాయకుడు, ఎర్రజెండా ముద్దుబిడ్డ కామ్రేడ్ జమాలుద్దీన్ 24వ వర్ధంతి సందర్భంగా జఫర్‌గడ్ మండలం తమ్మడపల్లి (జి) గ్రామంలో ఘనంగా నివాళులు అర్పించారు.గ్రామ కమిటీ ఆధ్వర్యంలో జమాలుద్దీన్ స్తూపం వద్ద ఆయన కుమారుడు ఎండి భాష పార్టీ జెండాను ఆవిష్కరించి పుష్పాంజలి ఘటించారు.ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు ఎండి షబానా మాట్లాడుతూ, కామ్రేడ్ జమాలుద్దీన్ చిన్ననాటి నుంచే కమ్యూనిస్టు ఉద్యమంలో పనిచేస్తూ ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావించి పోరాడిన ప్రజానాయకుడని అన్నారు. చిన్నవారిని ఆప్యాయంగా ఆదరించి, పెద్దలను గౌరవించే వ్యక్తిత్వం ఆయనదని కొనియాడారు. జమాలుద్దీన్ భౌతికంగా దూరమై 24 సంవత్సరాలు గడిచినా ఆయన ఆశయాలు, పోరాట స్ఫూర్తి పార్టీ కార్యకర్తలకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయని తెలిపారు. "నింగికెగిసిన అరుణ తారలలో, ఎగిరే ఎర్రజెండాలో మీ రూపాన్ని చూసుకుంటూ మీ ఆశయాలను ముందుకు తీసుకెళ్తాం" అని నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో జఫర్‌గడ్ మండల కమిటీ సభ్యుడు, ఉపసర్పంచ్ గంగరాజు, రాపర్తి రజిత, గ్రామ కార్యదర్శి వేల్పుల రవి, గ్రామ కమిటీ సభ్యులు ఎండి శంషుద్దీన్, సీహెచ్ మల్లేష్, వి. రాజు, పి. నాగరాజు, ఏ. ప్రభాకర్, ఎండి అక్బావలి, యాకుబ్బి, కె. రాజు, జి. రమేష్, యు. సోమయ్య, కె. అంజయ్య, వి. రాజు, ఎండి బషీర్, కొమరమ్మ, కౌసల్య తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆరోగ్యశ్రీ సాధన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన ఎంఆర్పీఎస్



**ధర్మసాగర్, ఆగస్టు 7 (తెలుగు గళం న్యూస్)**

ఎంఆర్పీఎస్ వ్యవస్థాపకుడు, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ధర్మసాగర్ మండల కేంద్రంలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్ సమీపంలో శుక్రవారం ఆరోగ్యశ్రీ సాధన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఎంఆర్పీఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు నక్క ప్రవీణ్ మాదిగ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఆర్పీఎస్ ధర్మసాగర్ మండల ఇన్‌చార్జి గంగారపు శ్రీనివాస్ మాదిగ మాట్లాడుతూ, ఎంఆర్పీఎస్ ఏబీసీడీ వర్గీకరణ కోసం ఉద్యమం కొనసాగిస్తూనే చిన్నారుల గుండె శస్త్రచికిత్సల కోసం కూడా పోరాటం చేసిందన్నారు. ఆ ఉద్యమ ఫలితంగానే అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం చిన్నారులకు గుండె ఆపరేషన్లు నిర్వహించే చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు.తదనంతరం అదే ఆలోచనను విస్తరించి కుల, మతాలకు అతీతంగా ప్రతి పేద కుటుంబానికి మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు.ఈ పథకం సాధనలో పద్మశ్రీ మందకృష్ణ మాదిగ కీలక పాత్ర పోషించినందున ప్రతి సంవత్సరం ఆగస్టు 7న రాష్ట్రవ్యాప్తంగా ఆరోగ్యశ్రీ సాధన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు.ఈ కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ నాయకులు పుట్ట ప్రణయ్ భాస్కర్, నక్క ప్రశాంత్, పుట్ట నరేష్, కొట్టె భాస్కర్, వెంకటస్వామి, చిరంజీవి, మహిళలు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆగస్టు 10 జైల్ భరో ఉద్యమాన్ని జయప్రదం చేయాలి-రాపర్తి రాజు

### మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్
### డీపీఓకు సీఐటీయూ గ్రామపంచాయతీ కార్మికుల వినతిపత్రం





**జనగామ, ఆగస్టు 7 (తెలుగు గళం న్యూస్)**

తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఆగస్టు 10న మండల, జిల్లా కేంద్రాల్లో నిర్వహించనున్న జైల్ భరో ఉద్యమాన్ని గ్రామపంచాయతీ కార్మికులంతా విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాపర్తి రాజు పిలుపునిచ్చారు.ఈ మేరకు జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) వెంకట్‌రెడ్డికి యూనియన్ జిల్లా నాయకులు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా రాపర్తి రాజు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా చేపట్టనున్న జైల్ భరో ఉద్యమంలో గ్రామపంచాయతీ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.అలాగే గ్రామపంచాయతీల్లో అమలు చేయాలని చూస్తున్న మల్టీపర్పస్ వర్కర్ (ఎంపీడబ్ల్యూ) విధానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విధానం కార్మికులపై పనిభారం పెంచడంతో పాటు ఉద్యోగ భద్రతకు భంగం కలిగిస్తుందని అన్నారు.గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న అదనపు కార్మికులకు నెలల తరబడి వేతనాలు చెల్లించకుండా పని చేయించడం అన్యాయమని, వెంటనే పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని కోరారు. కనీస వేతనాల అమలు, ఈఎస్ఐ, ఈపీఎఫ్ వంటి కార్మిక హక్కులను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు.కార్మికుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేకుంటే ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా గ్రామపంచాయతీ కార్మికులు ఆగస్టు 10న ఉదయం 10 గంటలకు మండల కేంద్రాల్లో జరిగే జైల్ భరో ఉద్యమంలో పాల్గొని కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నిరసన తెలపాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి బసవ రామచందర్, జిల్లా నాయకులు పగిడిపల్లి మల్లేష్, కొమరవెల్లి శ్రీనివాస్, కర్ణాకర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## తల్లి పాలే బిడ్డకు తొలి పోషకాహారం



**తెలుగు గళం న్యూస్ మహబూబాబాద్ జిల్లా.**

మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల కేంద్రంలోని రాంపురం అంగన్వాడీ సెంటర్ ఒన్ లో ప్రపంచ తల్లి పాల వారోత్సవాలు ఘనంగా నిర్వహిచారు. ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్ యశోద మాట్లాడుతూ తల్లి పాలు శిశువుకు సంపూర్ణమైన పోషకాహారాన్ని అందించడంతో పాటు, అనేక అనారోగ్యాల నుంచి రక్షణ కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తాయి అన్నారు,



శిశువు పుట్టిన వెంటనే వచ్చే ముర్రుపాలు (కొలస్ట్రం) ఎంతో విలువైనవి.వీటిలో శిశువు రోగనిరోధక శక్తిని పెంచే పోషకాలు ఉంటాయి అన్నారు,సాధ్యమైనంత వరకు పుట్టిన గంటలోపే తల్లిపాలు పట్టించడం, మొదటి ఆరు నెలలు శిశువుకు తల్లిపాలు మాత్రమే ఇవ్వడం ఆరోగ్యకరమైన అలవాటు అన్నారు,తల్లి పాల ప్రాముఖ్యతపై తల్లులు, కుటుంబ సభ్యులు, ప్రజల్లో అవగాహన కల్పించడమే తల్లి పాల వారోత్సవాల ప్రధాన ఉద్దేశ్యం అన్నారు,ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి తల్లి పాలు ఎంతో అవసరం అని తెలిపారు.ఈ సందర్భంగా పిల్లలకు అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించరు,ఈ కార్యక్రమం లోఅంగన్వాడీ టీచర్ యం యశోద, ఆయా విస్సంపెల్లి నాగమ్మ, ఆశవర్కర్ అనురాధ, ఆదిమూల పద్మ తదితరులు పాల్గొన్నారు.

# పెద్ది సుదర్శన్ రెడ్డికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి నివాళి..

## కుటుంబ సభ్యులకు పరామర్శ



**తెలుగు గళం న్యూస్ నర్సంపేట, ఆగస్టు 7**

తెలంగాణ ఉద్యమ నేత, మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు పెద్ది సుదర్శన్ రెడ్డి చిత్రపటానికి మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఘనంగా నివాళులర్పించారు.నర్సంపేట నియోజకవర్గంలోని నల్లబెల్లి గ్రామంలో ఉన్న పెద్ది సుదర్శన్ రెడ్డి స్వగృహానికి వెళ్లి ఆయన భార్య స్వప్నతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పెద్ది సుదర్శన్ రెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.ఆయనతో తనకున్న ఆత్మీయ అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ, చిన్న వయసులోనే తమ్ముడు లాంటి నాయకుడిని కోల్పోవడం ఎంతో బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.పెద్ది సుదర్శన్ రెడ్డి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించిన కడియం శ్రీహరి, కుటుంబ సభ్యులు ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. ఆయన లేని లోటు పూడ్చలేనిదని పేర్కొంటూ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ కోదండరాంతో పాటు స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థుల, నిరుద్యోగుల ద్రోహి సీఎం రేవంత్ రెడ్డి

- పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలి
- ఏబీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో హన్మకొండ కలెక్టరేట్ ముట్టడి విజయవంతం








**తెలుగు గళం న్యూస్ హన్మకొండ ఆగస్టు 07**

తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఏబీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో హన్మకొండ కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించారు.ఈ సందర్భంగా ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మంద నరేష్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో అధికారంలోకి వస్తే విద్యార్థులు, నిరుద్యోగులకు న్యాయం చేస్తామని హామీలు ఇచ్చిందని అన్నారు. ఆ హామీలను నమ్మి విద్యార్థులు, నిరుద్యోగులు, వారి తల్లిదండ్రులు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేశారని పేర్కొన్నారు.అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విద్యార్థులు, నిరుద్యోగులకు అన్యాయం జరుగుతోందని ఆయన ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు సకాలంలో విడుదల కాకపోవడంతో అనేక మంది విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కొందరు తమ చదువులను మధ్యలోనే నిలిపివేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు.ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయడంతో పాటు, అక్రమంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని, అనుమతులు లేని విద్యాసంస్థలను మూసివేయాలని ప్రభుత్వాన్ని కోరారు.అదేవిధంగా తెలంగాణ రాష్ట్రానికి పూర్తిస్థాయి విద్యాశాఖ మంత్రిని నియమించి విద్యారంగ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ఏబీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఏబీఎస్ఎఫ్ వరంగల్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్, కాకతీయ యూనివర్సిటీ అధ్యక్షులు అడ్డా రాజేష్, జిల్లా నాయకులు పోతుగంటి ఉదయ్ కిరణ్, కార్తీక్, వెంకటేష్, భాను, సాయికిరణ్, ప్రసన్న, కళ్యాణి, ప్రవళిక, పల్లవి తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 10 జైలు భరో విజయవంతం చేయాలి

- జూబ్లీహిల్స్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆటో జాతా







**తెలుగు గళం న్యూస్ హైదరాబాద్, ఆగస్టు 7**

కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కార్మికుల హక్కులను పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 10న ఖైరతాబాద్‌లో నిర్వహించే జైలు భరో -- రాజ్‌భవన్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె. వెంకటేష్, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి జె. కుమారస్వామి కార్మికులకు పిలుపునిచ్చారు.జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో శుక్రవారం నిర్వహించిన ఆటో జాతాలో వారు మాట్లాడుతూ, గతంలో అమలులో ఉన్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చడం ద్వారా కార్మికుల హక్కులను హరించే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. ఎనిమిది గంటల పని విధానాన్ని దెబ్బతీసి 12 గంటల పని దినాన్ని అమలు చేయడం, కనీస వేతనాల అమలును నిర్లక్ష్యం చేయడం, ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయ్‌మెంట్ పేరుతో ఉద్యోగ భద్రతను బలహీనపరచడం, సమ్మె చేసే హక్కు, సంఘాలు ఏర్పాటు చేసుకునే హక్కులను పరిమితం చేయడం వంటి చర్యలు కార్మికుల ప్రయోజనాలకు విరుద్ధమని అన్నారు.కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, కనీస వేతనాలు కల్పించాలని, విద్యుత్ రంగ ప్రైవేటీకరణను నిలిపివేయాలని, గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని బలోపేతం చేసి వ్యవసాయ కార్మికులకు ఎక్కువ రోజులు ఉపాధి కల్పించాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో "క్విట్ మోడీ" నినాదంతో ఆగస్టు 10న జరిగే జైలు భరో కార్యక్రమంలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా తమ నిరసనను తెలియజేయాలని నాయకులు పిలుపునిచ్చారు.ఆటో జాతా ఎస్పీఆర్ హిల్స్ రెండు బొమ్మల వద్ద ప్రారంభమై బోరబండ సైట్--3, మోతీనగర్ లేబర్ అడ్డా, యూసుఫ్‌గూడ లేబర్ అడ్డా, శ్రీనగర్ కాలనీ, హమ్మాళీ కార్మికుల ప్రాంతాలు, మానసిక వైద్యశాల వరకు కొనసాగింది.మార్గమధ్యంలోని పలు ప్రాంతాల్లో కార్మికులను చైతన్యపరిచి ఆగస్టు 10 జైలు భరో కార్యక్రమానికి భారీ సంఖ్యలో తరలిరావాలని కోరారు.ఈ కార్యక్రమంలో రాపర్తి అశోక్, టి. సాయి శేషగిరిరావు, జె. స్వామి, బాలు, సోమేష్, నరసింహ, రమేష్, రాజు, కేశవులు, దేవదాస్, బాలయ్య తదితర నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

# సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో వ్యక్తిత్వ వికాస శిక్షణ"





సత్తుపల్లి,ఆర్ సి,ఆగస్టు 07(తెలుగుగళం) న్యూస్: సత్తుపల్లి మండలంలోని గంగారం గ్రామంలో స్వయం ప్రతిపత్తి గల సాయిస్ఫూర్తి అటానమస్ ఇంజనీరింగ్ కళాశాలలో తొలి సంవత్సరం బీటెక్, డిప్లొమా, బి.ఫార్మసీ విద్యార్థులకు ప్రవేశ అవగాహన కార్యక్రమంలో భాగంగా వ్యక్తిత్వ వికాసం, వృత్తి మార్గదర్శకత్వం, ప్రేరణపై ప్రత్యేక శిక్షణ నిర్వహించారు.

వ్యక్తిత్వ వికాస శిక్షకుడు జవ్వాది వెంకటేశ్వరబాబు మాట్లాడుతూ లక్ష్య నిర్ధారణ, సమయపాలన, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, బృంద భావన, సంభాషణ నైపుణ్యాలు, నైతిక విలువలు, మత్తు పదార్థాల నివారణ, లైంగిక వేధింపుల నిరోధంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్పష్టమైన లక్ష్యంతో కృషి చేస్తే జీవితంలో విజయం సాధించవచ్చని సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వూటుకూరి శేషారత్నకుమారి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగి సమాజానికి ఆదర్శ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డాక్టర్ బండి పార్థసారథిరెడ్డి, ట్రస్టీ బండి అన్విద వర్చువల్‌గా పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. కార్యదర్శి దాసరి ప్రభాకర్ రెడ్డి, ఉప ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ యాకూబ్, విభాగాధిపతులు, అధ్యాపకులు, జాతీయ సేవా పథకం అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో లక్ష్యసాధనకు స్ఫూర్తినింపిన సాయిస్ఫూర్తి కళాశాల ప్రేరణ"






**సత్తుపల్లి,ఆర్ సి,ఆగస్టు07(తెలుగుగళం)న్యూస్ :**

సత్తుపల్లి మండలంలోని గంగారం గ్రామంలో గల స్వయం ప్రతిపత్తి సాయిస్ఫూర్తి ఇంజినీరింగ్ కళాశాలలో ప్రథమ సంవత్సరం ఇంజినీరింగ్, డిప్లొమా, ఔషధ విద్య కోర్సుల విద్యార్థులకు ప్రవేశ అవగాహన కార్యక్రమంలో భాగంగా ప్రేరణాత్మక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన వ్యక్తిత్వ వికాస శిక్షకుడు, ప్రేరణాత్మక వక్త, యోగ సాధకుడు కె.ఎస్.కె. జయదేవ్‌రావు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.

జీవితంలో స్పష్టమైన లక్ష్యాన్ని ఏర్పరచుకోవడం, సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం, అడ్డంకులను అధిగమించే ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవడం, విద్య ప్రాముఖ్యత, మానవీయ విలువలు, నాయకత్వ లక్షణాలు, సమష్టిగా పనిచేసే తత్వం, సంభాషణ నైపుణ్యాలు, మనోబలం, ఆరోగ్యం, తల్లిదండ్రులు, గురువుల పట్ల గౌరవం, వ్యక్తిత్వ వికాసం, సేవాభావం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు.

కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వూటుకూరి శేషారత్నకుమారి మాట్లాడుతూ ఉన్నత ఆశయాలు, నైతిక విలువలతో విద్యను అభ్యసించిన విద్యార్థులు భవిష్యత్తులో సమాజానికి, దేశానికి ఆదర్శ పౌరులుగా ఎదుగుతారని అన్నారు.

ఈ సందర్భంగా కళాశాల చైర్మన్, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ బండి పార్థసారథిరెడ్డి, ట్రస్టీ బండి అన్విద దృశ్య మాధ్యమం ద్వారా పాల్గొని విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులకు శుభాకాంక్షలు తెలిపారు. కళాశాల కార్యదర్శి, కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం మార్గదర్శకాల మేరకు ప్రవేశ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో: డాక్టర్ షేక్ మీరాసాహెబ్, విభాగాధిపతులు, అధ్యాపకులు, జాతీయ సేవా పథకం కార్యక్రమ అధికారి బలుసుపాటి సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తాం: రాష్ట్ర కార్యదర్శి రంజిత్ కుమార్




**స్టేషన్ ఘనపూర్, తెలుగుగళం , ఆగస్టు 07:**

రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ మెనిఫెస్టోలో హామీ ఇచ్చిన మేరకు ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టి ఎస్ యుటిఎఫ్) రాష్ట్ర కార్యదర్శి కానుగంటి రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఛాగల్ పాఠశాలలో భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులంతా నల్ల బ్యాడ్జీలతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యు ఎస్ పి సి) సమస్యల పరిష్కారం కోసం నాలుగు దశల పోరాట కార్యక్రమాన్ని ప్రకటించిందన్నారు. 1.7.2023 నుంచి అమలు చేయాల్సిన పి ఆర్ సి కి మూడు సంవత్సరాలు గడుస్తున్నా అతీగతీ లేదన్నారు. వెంటనే పి ఆర్ సి రిపోర్టును తెప్పించుకొని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ప్రతీ ఆరు నెలలకు ఒకసారి చెల్లించాల్సిన కరువు భత్యాన్ని 1.1.2024 నుంచి చెల్లించకపోవడం దారుణం అన్నారు. పెండింగ్ లో ఉన్న 6 డిఏలను వెంటనే మంజూరు చేయాలన్నారు. తమ రాజకీయ భవిష్యత్తు కోసం అనాలోచితముగా ఉచిత పథకాలను ప్రవేశపెట్టి ఆర్థిక విధ్వంసం సృష్టిస్తూ, రాజ్యాంగబద్ధంగా నియమితులై పనిచేస్తున్న ఉద్యోగస్తులను వేదించడం సరికాదన్నారు. రిటైర్డ్ అయిన ఉద్యోగుల గ్రాట్యుటీ, కమ్యుటేషన్ లతో పాటు, వారు సర్వీసులో ఉన్నప్పుడు పొదుపు చేసిన జీపిఎఫ్, టిఎస్ జిఎల్ఐ

మొత్తాలను ఏండ్ల తరబడి పెండింగ్ లో పెట్టి ఇవ్వకపోవడం పెన్షనర్ల పట్ల ప్రభుత్వానికి గల నిర్లక్ష్యానికి నిదర్శనం అన్నారు. ఇటీవల కోర్టులు ఉద్యోగులు, పెన్షనర్ల బకాయిలు వెంటనే చెల్లించాలని, ఆలస్యానికి వడ్డీ సైతం చెల్లించాలని తీర్పు ఇవ్వడం ప్రభుత్వాల అలసత్వానికి అద్దం పడుతోందని అన్నారు. ఇంకా డి ఎస్ సి-2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని రద్దు చేసి నూతన పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, ఇన్-సర్వీసు టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని, జీ.ఓ 25 ను సవరించి ఆ మేరకు ఉపాధ్యాయుల సర్దుబాటు చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే ప్రభుత్వం స్పందించి ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. లేని పక్షంలో ఆగస్టు 12,13 తేదీలలో మండలాల్లో మెమోరాండంలు, ఆగస్టు-19న జిల్లా ధర్నాలు, ఆగస్టు,29న రాష్ట్ర కేంద్రం హైదరాబాద్ లో మహాధర్నా నిర్వహిస్తామని తెలిపారు. అయినప్పటికీ సమస్యల పరిష్కారం జరగనట్లయితే సెప్టెంబర్ లో అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఛలో అసెంబ్లీ నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎ.అంజిరెడ్డి, జె.రాజేంద్రప్రసాద్,టి.వెంకటేశ్వర్లు, పి.లలితా కుమారి, ఆర్.శాంతి, జి.శ్రీనివాస్,ఎ.సోమరాజు, లక్ష్మి, ఖాన్, కుమార్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ డీఏలు వెంటనే విడుదల చేసి పీఆర్సీ ప్రకటించాలి

**-- నల్ల బ్యాడ్జీలతో యూఎస్పీసీ ఉపాధ్యాయుల నిరసన**

- ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం ఉధృతం చేస్తాం
- జీవో--25 సవరణ నుంచి సీపీఎస్ రద్దు వరకు అన్ని హామీలను వెంటనే అమలు చేయాలి

**-- ప్రభుత్వానికి యూఎస్పీసీ డిమాండ్**




**తెలుగు గళం ఏటూరునాగారం, ములుగు :**

ఉపాధ్యాయులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేసి, నూతన పీఆర్సీని తక్షణమే ప్రకటించాలని యూఎస్పీసీ (ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ) నాయకులు పోడెం సమ్మయ్య, పల్లె నాగరాజు ప్రభుత్వాన్ని గట్టిగా డిమాండ్ చేశారు. తమ న్యాయమైన హక్కులను సాధించుకునే క్రమంలో శుక్రవారం ఏటూరునాగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఉపాధ్యాయుల సమస్యలు కేవలం ఉద్యోగుల సమస్యలు కావని, రాష్ట్ర విద్యా వ్యవస్థ భవిష్యత్తుతో ముడిపడి ఉన్న ప్రజా సమస్యలని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంబించడం వల్ల విద్యారంగం తీవ్రంగా నష్టపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్ డీఏలు విడుదల చేసి పీఆర్సీ ప్రకటించడం, ప్రాథమిక విద్యకు నష్టదాయకంగా మారిన జీవో--25ను సవరించడం, టెట్‌లో సర్వీస్ వెయిటేజ్ కల్పించడం, సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించడం, మెమో--57 ప్రకారం 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపజేయడం, కేజీబీవీ, యూఆర్ఎస్, సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేయడం, అలాగే హెల్త్ కార్డులను పూర్తిస్థాయిలో అమలు చేయడం వంటి డిమాండ్లను తక్షణమే నెరవేర్చాలని కోరారు. ప్రభుత్వం ఇకపై ఆలస్యం చేయకుండా ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు జరిపి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని యూఎస్పీసీ నాయకులు హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో ఉపాధ్యాయులు సీహెచ్.సుమన్, ఎస్.శ్రవణ్ కుమార్, కె.రాజన్న, బి.సూర్య, బి.రాజు, శోభ, రజిత, మాధవి, రజని, పద్మశ్రీ, రమాదేవి తదితరులు పాల్గొని ప్రభుత్వానికి తమ నిరసనను తెలియజేశారు.

Printed and Published by Rayaparthi Bhanuprasad on be half Of Telugu galam
H.No: 1-6, Thammadapally-G, Guduru, PO: Thammadapalli 506316 , Jangoan , Telangana State,
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.